ప్లాస్టిక్ నిషేధం దిశగా అడుగులు..

- దుకాణాల యజమానులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు
- పట్టించుకోని వారికి జరిమానా
- తగ్గిన ప్లాస్టిక్ వినియోగం

మునుగోడు: పర్యావరణానికి ముప్పు కలిగించే ప్లాస్టిక్‌ను మునుగోడులో పూర్తిగా నిషేధించేందుకు అధికారులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. నెల రోజులుగా వివిధ రకాల ప్రయత్నాలు చేసి ఇప్పటివరకు దాదాపు 90 శాతం వరకు ప్లాస్టిక్ నిషేధం అమలు చేశారు. మునుగోడు మండల కేంద్రంలోని దుకాణాల యజమానులకు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించడంతోపాటు నోటీసులు కూడా జారీ చేశారు. దీంతో ప్రజల్లో, దుకాణదారుల్లో క్రమంగా మార్పు వస్తోంది.

దాదాపు 30 కేజీలకుపైగా కవర్లు సీజ్..

మునుగోడు మండల కేంద్రంలో దాదాపు 260కి పైగా దుకాణాలు ఉన్నాయి. ఆయా దుకాణదారులందరికీ గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ విజయభాస్కర్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అంతేకాకుండా వారం రోజుల్లో ప్లాస్టిక్ కవర్ల విక్రయాలు పూర్తిగా నిలిపివేయాలని నోటీసులు కూడా జారీ చేశారు. అయినా కొందరు ప్లాస్టిక్ కవర్లను వినియోగించడంతో గ్రామ పంచాయతీ సిబ్బందితో దాదాపు 30 కేజీలకు పైగా ప్లాస్టిక్ కవర్లను సీజ్ చేయించారు. అనంతరం ఎంపీడీఓతోపాటు పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది ప్రతి ఒక దుకాణం వద్దకు వెళ్లి ప్లాస్టిక్ వినియోగించవద్దని సూచించారు. అయినా కొందరు వినకపోవడంతో నలుగురు దుకాణాల యజమానులకు ఒక్కొక్కరికి రూ. 500 చొప్పున జరిమానాలు కూడా విధించారు. దీంతో మునుగోడులో ప్లాస్టిక్ విక్రయాలకు, వినియోగానికి జంకుతున్నారు. జరిమానాలు విధిస్తుండడంతో క్రమంగా ప్లాస్టిక్ వినియోగం తగ్గింది. దుకాణాల యజమానులు, ప్రజలు కూడా అధికారులు చేస్తున్న ప్రయత్నానికి సహకరిస్తున్నారు.



ప్లాస్టిక్ కవర్లు వినియోగించవద్దని దుకాణాల యజమానులకు సూచిస్తున్న అధికారులు

పర్యావరణాన్ని కాపాడేందుకే ప్లాస్టిక్ నిషేధం



ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి హాని కలుగుతుంది. పర్యావరణాన్ని కాపాడేందుకు మునుగోడులో పూర్తిగా ప్లాస్టిక్ నిషేధించాలని నిర్ణయం తీసుకున్నాం. అందుకు ప్రతిఒక్కరూ సహకరిస్తున్నారు. వినని వారికి జరిమానాలు కూడా విధిస్తున్నాం. దీంతో ఇప్పటివరకు 90 శాతం నిషేధం అయిందని భావిస్తున్నాం. ఎవరైనా ప్లాస్టిక్ వినియోగిస్తే మాకు చెప్పినట్లయితే వారి పేర్లు గోప్యంగా ఉంచుతాం.

–విజయ భాస్కర్, ఎంపీడీఓ, మునుగోడు

ప్లాస్టిక్ నిషేధం హర్షణీయం



పర్యావరణానికి ముప్పు కలిగించే ప్లాస్టిక్‌ను నిషేధించడం హర్షించదగ్గ విషయం. అధికారుల సూచనల ప్రకారం ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ కవర్ల వినియోగం పూర్తిగా తగ్గించాలి. దాని వల్ల పర్యావరణానికి మేలు కలుగుతుంది. అధికారులు చేస్తున్న ప్రయత్నానికి మా సహాయ సహకారాలు ఎల్లవేళలా అందిస్తాం.

–ఎండీ అన్వర్, మాజీ కోఆప్షన్ సభ్యుడు

ప్రతి పేద కుటుంబానికి ఇల్లు ఇస్తాం

- డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి

మునుగోడు: అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి కట్టిస్తామని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మునుగోడు మండలంలోని రావిగూడెం, గంగోరిగూడెం, కచలాపురం గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తోందన్నారు. మొదటి దఫాలో మునుగోడు నియోజకవర్గంలో 3500 ఇళ్లు మంజూరు చేసిందన్నారు. రెండో దఫా మరో నాలుగు వేల ఇళ్లు మంజూరు చేస్తుందన్నారు. ఇల్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణ పనులు మొదలు పెడితే ప్రభుత్వం దశల వారీగా నగదు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో చండూరు మార్కెట్ చైర్మన్ దోటి నారాయణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, ఎంపీడీఓ విజయ భాస్కర్, ఎంపీఓ స్వరూపరాణి, మాజీ ప్రజా ప్రతినిధులు గుర్జ రామచంద్రం, గోపగోని పాపయ్య పాల్గొన్నారు.

ప్రొసీడింగ్ పత్రాలు అందజేత

కనగల్: మండలంలోని ఏమిరెడ్డిగూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు సోమవారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఏమిరెడ్డి భూపాల్ రెడ్డి హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లుతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణ ప్రొసీడింగ్ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వేమిరెడ్డి మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మునుగోడు: రావిగూడెంలో ఇందిరమ్మ ఇంటి పనులు ప్రారంభిస్తున్న కుంభం శ్రీనివాస్‌రెడ్డి

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేత

తిప్పర్తి : ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్మించుకోవాలని తిప్పర్తి ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం తిప్పర్తి మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇళ్లు మంజూరైన వారు 45 రోజుల్లోపు నిర్మాణ పనులు చేపట్టాలని, సంవత్సరంలో పూర్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బద్దం సుధీర్, మాజీ సర్పంచ్‌లు రొట్టెల రమేష్, జాకటి మోషు, మాజీ ఎంపీటీసీలు పల్లె ఎల్లయ్య, కిన్నెర అంజి, నాయకులు బద్దం సైదులు గౌడ్, ప్రశాంత్, రమేష్‌రెడ్డి, గౌస్, పంచాయతీ కార్యదర్శి నర్సింహ స్వామి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

నల్లగొండ టూటౌన్ : నిజామాబాద్ జిల్లాలో ఈ నెలాఖరు నుంచి నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు నల్లగొండ జిల్లా కేంద్రానికి చెందిన విపస్యా స్కూల్ విద్యార్థులు ముగ్గురు ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయి పోటీల కోసం ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంపిక పోటీలు నిర్వహించగా తమ పాఠశాల నుంచి ముగ్గురు క్రీడాకారులను ప్రతిభ కనబర్చి ఎంపికైనట్లు విపస్యా స్కూల్ ప్రధానోపాధ్యాయుడు శ్రీకాంత్ తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను పాఠశాల చైర్మన్ బండారు ప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు శ్రీకాంత్, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించాలి

నల్లగొండ టౌన్: నల్లగొండ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతూ సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ సలీం, పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య సోమవారం డీఈఓ భిక్షపతికి వినతి పత్రం అందజేశారు. నల్లగొండలో ఉన్న 14 ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సర్వే నిర్వహించామని, 14 పాఠశాలలకు గాను 6 పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వంటలు చెట్ల కింద చేస్తున్నారని తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు తుమ్మల పద్మ, కోట్ల అశోక్ రెడ్డి, అద్దంకి నరసింహ, రవీందర్‌లు ఉన్నారు.

క్రీడలకు నిధులు కేటాయించాలని వినతి

నల్లగొండ టూటౌన్: క్రీడలకు బడ్జెట్‌లో 5 శాతం నిధులు కేటాయించాలని కోరుతూ టీపీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా పీఈటీ అసోసియేషన్ నాయకులు సోమవారం హైదరాబాద్‌లో క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరికి వినతి పత్రం అందజేశారు. జిల్లా పీఈటీల అసోసియేషన్ చైర్మన్ బొమ్మపాల గిరిబాబు, ఇమామ్ కరీం, నారాయణ, కవిత పాల్గొన్నారు.

స్నేహితుడికి చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

మునుగోడు: భార్య అనారోగ్యంతో మృతి చెంది ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న స్నేహితుడికి సోమవారం రూ.50వేల ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచారు తోటి స్నేహితులు. మునుగోడు మండలంలోని సింగారం గ్రామానికి చెందిన కోడి నరేష్ భార్య నవ్య ఇటీవల మృతి చెందింది. నరేష్‌కు ఆర్థికంగా ఆదుకునేందుకు స్నేహితులు చందాలు వేసుకుని రూ. 50వేల నగదు నరేష్ కుమారుడు వరుణ్‌తేజ పేరుపై పోస్టాఫీసులో డిపాజిట్ చేశారు.

ప్రైవేట్ స్కూల్ బస్సును అడ్డుకున్న గ్రామస్తులు

చండూరు : మండల పరిధిలోని పుల్లెంల గ్రామంలో గ్రామస్తులు ప్రైవేట్ స్కూల్ బస్సును అడ్డుకున్నారు. గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలకు తమ పిల్లలను పంపుతామని, గ్రామంలోకి ప్రైవేటు బస్సులు రావాల్సిన అవసరం లేదని ఆందోళనకు దిగారు. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల భారం ఎక్కువగా ఉందని, భరించలేకపోతున్నామని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొన్నారు.

'విద్యా వ్యవస్థను పట్టించుకోని ప్రభుత్వం'

కట్టంగూర్ : విద్యా వ్యవస్థను ప్రభుత్వం పట్టించుకోకుండా గాలికి వదిలేసిందని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున ఆరోపించారు. సోమవారం కట్టంగూర్ మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్ నిర్వహించిన జిల్లాస్థాయి కేవీపీఎస్ ముగింపు శిక్షణ తరగతుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను, పిట్టల రవి, రెవిడాల పరుశురాములు, పెంజర్ల సైదులు, మల్ల మహేష్, కృష్ణ, నర్సింహ, ముసుకు రవీందర్ పాల్గొన్నారు.

ఈదురు గాలులకు విరిగిపడిన విద్యుత్ స్తంభం

శాలిగౌరారం: మండలంలో సోమవారం సాయంత్రం వీచిన ఈదురు గాలులకు రామగిరిలో పంట పొలాల్లో హెచ్‌టీ విద్యుత్ స్తంభం విరిగి నేలకూలింది. ఆ సమయంలో పంటపొలంలో రైతులు, కూలీలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విద్యుత్ స్తంభం విరగడంతో సుమారు 20 వ్యవసాయ బావులతోపాటూ గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న విద్యుత్ సిబ్బంది మరో విద్యుత్‌లైన్ ద్వారా గ్రామానికి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

డ్రగ్స్ నిర్మూలనకు సహకరించాలి



కనగల్: మొక్క నాటుతున్న ఎస్ఐ విష్ణుమూర్తి



మర్రిగూడ : మొక్క నాటుతున్న అధికారులు

చిట్యాల: సమాజంలో డ్రగ్స్ మహమ్మరిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని నార్కట్‌పల్లి సీఐ కె.నాగరాజు అన్నారు. అంతర్జాతీయ యాంటి డ్రగ్స్ అవగాహన వారోత్సవాలను సోమవారం చిట్యాల పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ ఆవరణలో సీఐ మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత డ్రగ్స్ వినియోగిస్తే జీవితాన్ని నాశనం చేసుకోవడంతోపాటు సమాజంలో మంచి పేరు కోల్పోతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అప్రీన్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్, గంజాయి సమాజానికి ప్రమాదకరం

చండూరు : మాదకద్రవ్యాలు, డ్రగ్స్, గంజాయి సమాజానికి చాలా ప్రమాదకరమని చండూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆదిరెడ్డి అన్నారు. సోమవారం చండూరులోని గాంధీజీ పాఠశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్ వారోత్సవాల సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. యువత మాదక ద్రవ్యాలు వాడుతున్నట్లు వార్తలు వస్తున్నాయని, వాటిని వీడి భవిష్యత్‌పై దృష్టి సారించాలన్నారు. పాఠశాల స్థాయి నుంచి డ్రగ్స్ వినియోగం వల్ల జరిగే అనర్థాలను తెలుసుకున్నట్లుయితే పెడదారి పట్టకుండా ఉంటారని అన్నారు. అనంతరం విద్యార్థులతో ఎస్ఐ కారింగు వెంకన్నగౌడ్ ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో లింగారెడ్డి, గాంధీజీ పాఠశాల చైర్మన్ కోడి శ్రీనివాసులు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్‌గౌడ్, గంట సత్యం, కృష్ణారెడ్డి, పాఠశాల డైరెక్టర్ వెంకన్నగౌడ్, ప్రిన్సిపాల్ కృష్ణయ్య, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కనగల్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కనగల్ ఎస్ఐ పి.విష్ణుమూర్తి అన్నారు. సోమవారం మిషన్ పరివర్తనలో భాగంగా కనగల్ పోలీస్ స్టేషన్ లో ఆయన మొక్కలు నాటి మాట్లాడారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది వీరయ్య, సురేష్,సైదులు, లింగరాజు, బేబీ శాలిని, భవాని, మోహన్ బాబు, రాజు పాల్గొన్నారు.

మర్రిగూడ: యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా మంచి అలవాట్లను అలవర్చుకోవాలని ఎస్ఐ మునగాల కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థకు మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ జి.చినముసయ్య, ఎంఈఓ బిట్టు శ్రీనివాస్ మాట్లాడుతూ యువత గంజాయి, మాదకద్రవ్యాల బారిన పడకుండా కష్టపడి చదువుకుని భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు చేరుకుని తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కళా శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిబిల్ స్కోర్‌తో సంబంధం లేకుండా ఎంపిక చేయాలి

కట్టంగూర్ : రాజీవ్ యువ వికాసం పథకానికి సిబిల్ స్కోర్‌తో సంబంధం లేకుండా లబ్ధిదారులను ఎంపిక చేయాలని సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో డీటీ ఫ్రాంక్లిన్ ఆల్బర్ట్‌కు డీవైఎఫ్ఐ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్ మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజున అర్హులను ప్రకటిస్తామని చెప్పిన ప్రభుత్వం నేటికీ అమలు చేయకపోవడంతో నిరుద్యోగ యువత పట్ల ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోందన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గద్దపాటి సుధాకర్, సహాయ కార్యదర్శి అజయ్, చిలువల కృష్ణయ్య, మల్లేష్ ఉన్నారు.

శ్రీరామలింగేశ్వరస్వామి మాస కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

నకిరేకల్: పట్టణంలోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి మాస కల్యాణ మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారి జిగురు లక్ష్మీ నర్సింహమూర్తి ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవం నిర్వహించారు. హాజరైన భక్తులందరికీ అన్న ప్రసాద వితరణ చేశారు. వేడుకల్లో ఆలయ చైర్మన్ ఉప్పల రమేష్, ధర్మకర్తలు కొండ వెంకన్న, బొప్పని యాదగిరి, రవిచంద్ర, కందాల ప్రవీన, గీతా మందిరం అధ్యక్షుడు పబ్బతి వెంకన్న ముదుదూడ్ల కృష్ణమూర్తి, వీరవెల్లి రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జీవితం స్ఫూర్తిదాయకం



నల్లగొండ టూటౌన్ : శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



నకిరేకల్ : నివాళులర్పిస్తున్న నాయకులు



కేతేపల్లి : పూలమాల వేస్తున్న నాయకులు



చిట్యాల: పూలమాల వేస్తున్న బీజేపీ నాయకులు

నల్లగొండ టూటౌన్ : డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి అన్నారు. సోమవారం బలిదాన్ దివస్ సందర్భంగా నల్లగొండ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకు ముందు 34వ వార్డులో మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా నాగం వర్షిత్ రెడ్డి మాట్లాడుతూ దేశం కోసం, దేశ ప్రజల కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన శ్యామ్ ప్రసాద్ ముఖర్జీని ప్రజలు ఎప్పటికీ మరచిపోరని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి, పిల్లి రామరాజుయాదవ్, వీరెల్లి చంద్రశేఖర్, పోతెపాక లింగస్వామి, కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, పకీరు మోహన్‌రెడ్డి, మిర్యాల వెంకటేశం, రావెళ్ల కాశమ్మ, కిషన్, జగ్జీవన్ తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్: డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా నకిరేకల్‌లో బీజేపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నకిరేకల్ మెయిన్ సెంటర్‌లో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ, మండల అధ్యక్షులు గర్రె మురళి మోహన్, బుడిగె సైదులు, నాయకులు మండల వెంకన్న, గుడుగుంట్ల సాయన్న, జిల్లా డాకయ్య, ఉప్పల నాగరాజు, పందాల సైదులు, కొండేటి శ్రీను, బోనగిరి వెంకటేశ్వర్లు, జగదీష్, నల్లగంటి విక్కీరామ్, మేడిపల్లి శివ, రవిశంకర్, ఏర్పుల నరేష్, నక్క నవీన్, గోపయ్యపాల్గొన్నారు.

చిట్యాల: జన సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్‌ను సోమవారం చిట్యాలలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు గుండాల నరేష్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నకిరేకంటి మొగులయ్య, రాష్ట్ర కార్యదర్శి మాస శ్రీనివాస్, బీజేపీ జిల్లా కార్యదర్శి బొడిగె అశోక్, నాయకులు చికిలంమెట్ల అశోక్, కన్నెబోయిన మహాలింగం, పల్లె వెంకన్న, గంజి గోవర్ధన్, కంచర్ల శంకర్‌రెడ్డి, కందాటి చంద్రారెడ్డి, సుంచు శ్రీను, దామరోజు నాగరాజు పాల్గొన్నారు.

కేతేపల్లి: బలిదాన్ దివస్ సందర్భంగా కేతేపల్లి మండలకేంద్రంలో డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని బీజేపీ నాయకులు నిర్వహించారు. ఈసందర్భంగా శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పిట్టల వెంకట్, నాయకులు తాడోజు నర్సింహాచారి, ఎ.అనిత, గడ్డం వేణుగోపాల్‌రెడ్డి, సమ్మెట విజయలక్ష్మి, నూకల సంధ్య, తిరుగుడు శైలజ, పోకల రమేష్, చిరంజీవి, కుంభం శ్రీకాంత్ మల్లం కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ: శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ఆశయ సాధనకు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దోనూరు వీరారెడ్డి అన్నారు. సోమవారం బలిదాన్ దివాస్ సందర్భంగా మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పాత్లావత్ రాజేందర్‌నాయక్, యాస అమరేందర్‌రెడ్డి, పిట్టల శ్రీనివాస్, యాస అశోక్‌రెడ్డి, గార గోపాల్, కేసరి రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

షూ, బెల్టులు అందజేత

కనగల్: మండలంలోని దర్వేశిపురం గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో వందమంది విద్యార్థులకు సోమవారం పాఠశాల ఉపాధ్యాయుడు జైపాల్ మిత్రులైన పార్థసారథి, ఎల్లయ్య ఆర్థిక సాయంతో షూ, బెల్ట్, టైలను ఎంఈఓ వి.పద్మ పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్..

చండూరు : మండలంలోని ఉడుతలపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ దాత ఓంకారం సహకారంతో పాఠశాలకు పెయింటింగ్ వేయించినట్లు తెలిపారు. అదేవిధంగా దాతల సహాయంతో విద్యార్థులకు నోట్స్ పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కొరిమి ఓంకారం, హెచ్ఎం సంగీత, ఉపాధ్యాయుడు రాజేశ్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

నకిరేకల్ : కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుకోసం కృషి చేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ పిలుపునిచ్చారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియామకమైన దైద రవీందర్‌ను నకిరేకల్‌లో సోమవారం ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ మాజీ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ పార్టీ ఇచ్చిన ఆదేశాల మేరకు పని చేస్తానని అన్నారు. కార్యక్రమంలో నాయకులు గార్లపాటి రవీందర్‌రెడ్డి, మేరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, ముద్దం విజయ్, అల్లి అంజన్ కుమార్‌యాదవ్, పాల్వాయి ప్రవీన్, బోళ్ల గోపిరెడ్డి, లక్ష్మణ్, పోరెళ్ల శివ, రాజశేఖర్, సతీష్, గిరి, మహేష్, వంటెపాక నక్షత్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ

కేతేపల్లి: మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ సాధ్యమని కేతేపల్లి ఎస్ఐ సతీష్ అన్నారు. కేతేపల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట ఉన్న మూసీ కుడి కాల్వ కట్టపై సోమవారం ఆయన మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ కాలుష్య నివారణకు మొక్కల పెంపకమే మార్గమన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది వెంకటేశ్వర్లు, రాకేష్, వెంకటరమణ, నరేందర్, పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి



మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

నల్లగొండ టౌన్ : ఇందిరమ్మ కమిటీలను రద్దు చేసి అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నల్లగొండలోని దొడ్డి కొమురయ్య భవన్‌లో జరిగిన ఐద్వా జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. పేదలను విస్మరించి అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారని విమర్శించారు. గ్రామ సభల ద్వారా లబ్ధిదారులకు ఎంపిక చేయాలన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రతి గ్రామంలో మహిళా శక్తి భవనాలను నిర్మించాలన్నారు. జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించి నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. వరలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి, కొండ అనురాధ, జిట్టా సరోజ, పాదూరి గోవర్ధన, తుమ్మల పద్మ, భూతం అరుణకుమారి, నాగమణి, ధనలక్ష్మి, లక్ష్మి, సుల్తాన, కౌసల్య, ఉమా, మంజుల పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని వినతి

నల్లగొండ పట్టణంలో నివాసం ఉంటున్న పేదలకు ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని కోరుతూ సీపీఐ నాయకులు సోమవారం నల్లగొండ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పబ్బు వీరస్వామి, కత్ర సైదిరెడ్డి, లెనిన్, సుజాత, విజయ, చింత ధనలక్ష్మి, దోటి పాండరి, సునిత పాల్గొన్నారు.

విద్యాసంస్థలు, హాస్టళ్లను తనిఖీ చేయండి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ: మండల ప్రత్యేక అధికారులు వారి పరిధిలోని విద్యాసంస్థలు, అన్ని హాస్టళ్లను నిరంతరం తనిఖీ చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. నల్లగొండలోని కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా అధికారులతో నిర్వహించిన సమ్మిళిత సమావేశంలో ఆమె మాట్లాడారు. పాఠశాలల్లో ఎక్కడా వాన, మురికి నీరు నిల్వ ఉండకుండా, ముళ్లపొదలు, చెత్తాచెదారం లేకుండా చూడాలన్నారు. మూసీ పరీవాహక ప్రాంతంలో విష పురుగుల బెడద ఎక్కువగా ఉందని అక్కడ ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. అనంతరం స్వచ్ఛ సర్వేక్షణ గ్రామీణ–2025 పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి, అధికారులు శ్రీనివాస్‌రావు, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదులు

నల్లగొండ టౌన్: ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీ అరికట్టాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతి పత్రం అందజేశారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా డొనేషన్లు, అడ్మిషన్ల పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులను దోపిడీ చేస్తున్నారని, ఫీజులను అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వలమల్ల ఆంజనేయులు, ముదిగొండ మురళీకృష్ణ, జిల్లా కోశాధికారి గాదెపాక సూర్యతేజ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని..

నాంపల్లి: మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలతోపాటు వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేవైఎం మండల అధ్యక్షుడు నాంపల్లి సతీష్ సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. నాంపల్లి మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడంతో పేద విద్యార్థులు దూర ప్రాంతానికి వెళ్లి చదువుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

బాలల చట్టాలపై అవగాహన ఉండాలి

కట్టంగూర్ : బాలల చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని బాలల పరిరక్షణ విభాగం ప్రొటెక్షన్ అధికారి ఎస్.రేవతి సూచించారు. సోమవారం కట్టంగూర్ మండలంలోని అయిటిపాముల బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో బాలల హక్కులపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బాలల హక్కులు, బాల్య వివాహాలు, పోక్సో చట్టం, పర్సనల్ హైజినిక్ న్యూట్రిషన్ పై బాలికలకు అవగాహన కల్పించారు. బాలల హక్కులను పరిరక్షించడం సమాజంలో ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. మంచి వాతావరణం నుంచి వచ్చిన పిల్లలు మంచి ప్రవర్తనతో ఎలాంటి పరిస్థితినైనా విజయవంతంగా అధిగమించగలరని తెలిపారు. బాలికలు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారదారాణి, ప్రాథమిక ఆస్పత్రి వైద్యాధికారి శ్వేత, రేవతి, ఎన్‌జీఓ సభ్యురాలు ఝాన్సీ, పాఠశాల హెచ్ఎం, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు ఉన్నారు.



కనగల్: ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు

కనగల్: బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మంజుల, శ్రీలత అన్నారు. సోమవారం కనగల్ మోడల్ స్కూల్లో బాలికల సాధికారిత, మిషన్ వాత్సల్య, 1098, 181 హెల్ప్ లైన్ నంబర్లపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. బాలికలు సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం బాలికలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏహెచ్‌టీయూ కృష్ణారెడ్డి, సోనీ, అశ్విత, శేషాదేవి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ ఫీజులు చెల్లించాలని ధర్నా



ధర్నా చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు , విద్యార్థులు

నల్లగొండ: బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రెండేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ పలువురు తల్లిదండ్రులు సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట తమ పిల్లలతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫీజులు చెల్లించకపోవడంతో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు తమ పిల్లలకు పాఠ్యపుస్తకాలతోపాటు యూనిఫామ్ ఇవ్వడం లేదన్నారు. ప్రైవేట్ యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలని తమపై ఒత్తిడి చేస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు కార్తీక్, శంకర్, సైదులు, యాదయ్య, వెంకటేశం, అనిత, రవి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.